సీఎం ఇలాకాలోనే తాగునీటి కరువా?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలోనే ప్రజలు తాగునీటి గోస ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లోని టేకుల్‌కోడ్ గ్రామ ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కి నిలదీస్తున్న దృశ్యాలను ఆయన ఎక్స్ ద్వారా ఎండగట్టారు. వేసవి ప్రారంభంలోనే తాగునీటి కోసం జనం అవస్థలుపడే వాతావరణం ఉంటే ఇక ముందు ముందు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల్లో ఎలాగూ కోతలు విధిస్తున్నారు... కనీసం, తాగునీటి కొరత అయినా లేకుండా చూడండి అని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

టేకల్‌కోడ్ గ్రామంలో నీళ్లు రాక ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు.

సీఎం ఇలాకాలో నీటికి కటకట

- వేసవి రాకముందే తాగునీటి ఎద్దడి
- ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు
- రెండు నెలలుగా తప్పని తిప్పలు
- బావి నీళ్లతోనే దాహం తీర్చుకొంటున్న స్థానికులు

కొడంగల్, ఫిబ్రవరి 13 : వేసవి రాకముందే సీఎం ఇలాకాలో తాగునీటి ఎద్దడి ప్రారంభమైంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం టేకల్‌కోడ్ వాసులు రెండు నెలలుగా నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు. గత పక్షం రోజులుగా పరిస్థితి మరీ దారుణంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి ఎద్దడిని నిరసిస్తూ గురువారం మహిళలు ఖాళీ బిందెలతో గ్రామంలోని రోడ్డుపై నిరసన తెలిపారు. గ్రామంలో దాదాపు 500 వరకు ఇండ్లు ఉన్నాయని, ఓ కాలనీలోనే ఇటువంటి పరిస్థితి నెలకొని 150 ఇండ్లకు నీటి సమస్య నెలకొందని వారంటున్నారు. బోర్ల ద్వారా బావుల నుంచి నీటిని తోడుకొని దాహాన్ని తీర్చుకొంటున్నట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నీటి ఎద్దడి ఉండేదని, బావులపైనే ఆధారపడి కాలాన్ని గడిపిన రోజులు ఉన్నట్టు చెప్తున్నారు. కేసీఆర్ సీఎం అయిన తరువాత గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ పైపులు వేసి మంచి నీటిని అందించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే తమకు కష్టాలు ప్రారంభమైనట్టు పేర్కొన్నారు. నీటి సమస్యపై ఎంపీవో జైపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. గ్రామంలో నల్లాలకు మోటర్లు బిగించడం వల్ల ఓ వీధికి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. మోటర్లను తొలగిస్తే సమస్య తీరుతుందని చెప్పారు. గ్రామంలో నీటి ఎద్దడి ఉన్నట్టు తమకు సమాచారం లేదని మిషన్ భగీరథ డీఈ శశాంక్‌మిశ్రా తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పంపుల నుంచి నీళ్లు తెచ్చుకొంటున్నం

మా వీధికి నీళ్లు రాక రెండు నెలలు కావస్తుంది. అధికారులకు చెప్పినా సమస్య తీరడం లేదు. ఉదయం లేవగానే బోర్ల వద్ద పడిగాపులు కాస్తున్నాం. గతంలో మిషన్ భగీరథ నీళ్లకు ఇట్ల ఇబ్బంది పడలేదు. అధికారులు స్పందించి మా గల్లీకి నీళ్లు వచ్చేలా చూడాలి.

- సుజాత, టేకల్‌కోడ్, కొడంగల్

నీళ్లు లేక ఎండిపోయిన మక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు రాజు

ఎండిన మక్క పంటను మేస్తున్న మేకలు

చెరువు ఎడారి.. చేను తడారి!

మొదటిపేజీ తరువాయి...

రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత అనుభవాలతోనైనా మేల్కొని ప్రభుత్వం సరైన రీతిలో నీటి నిర్వహణ చేపడుతుందని భావించిన రైతులకు.. ఈ సారి కూడా నిరాశే మిగిలింది. జిల్లా కేంద్రానికి అతి చేరువలో ఉన్న చామన్‌పల్లి, ఎలబోతారం, నల్లగుంటపల్లి, ముగ్ధంపూర్ తదితర గ్రామాల్లో కాలువ నీళ్లందక పంటలు ఎండుతున్నాయి. చామన్‌పల్లి గ్రామానికి వచ్చే 11- ఆర్ కాలువకు సరిపడా నీళ్లు వదలకపోవడంతో చివరి పొలాలకు అందడం లేదు. ఈ కాలువ కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టు ఉండగా.. కాలువలో పారుతున్న నీరు 50 ఎకరాలకు కూడా సరిపోవడం లేదు.

చామన్‌పల్లిలోని రైతు దూడం శ్రీనివాస్ బావిలో పూడిక తీస్తున్న కూలీలు

ఎండిపోతున్న పంటలు

చామన్‌పల్లికి చెందిన రైతు బోగొండ రాజు బావి నీళ్లతో గతేడాది మూడెకరాల్లో వరి, ఎకరంలో మక్కజొన్న సాగు చేశారు. సాగు నీరు అందక ఇబ్బంది పడ్డారు. ఆ అనుభవంతో ఈ సారి మూడెకరాల్లో మక్కజొన్న, ఎకరంలో వరి సాగుచేశారు. బావి పూర్తిగా ఎత్తివేయడంతో రూ.2 లక్షలు ఖర్చు చేసి బోరు వేయించుకున్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో బోరు ద్వారా ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదు. నీళ్లు లేక మక్క పూర్తిగా ఎండిపోయే పరిస్థితి వచ్చింది. వరి పొలం కూడా ఎండిపోయింది. మహిళా రైతు బోగొండ లక్ష్మి సాగు చేసిన 3.20 ఎకరాల మక్క పంటను పశువులకు వదిలేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కాలువ చివరి ఆయకట్టు రైతులందరిది ఇదే పరిస్థితి.

ఎండలు ముదిరితే మరింత నష్టం

కరీంనగర్ జిల్లాలో గతంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ కనిపించలేదు. కేసీఆర్ పాలనలో నిండు వేసవిలోనూ చెరువులన్నీ మత్తళ్లు దుంకేవి. కానీ, ఇప్పుడు వేసవి సమీపించకముందే పంటలు మాడిపోతున్నాయి. ఇంకా రెండు నెలల పాటు పంటలకు నీటి తడులు అవసరం. దీంతో ఏం చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్ మండలంలోని చామన్‌పల్లి, ముగ్ధంపూర్, నల్లగుంటపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రామన్నపేట, దేవునిమిట్ల, ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి, సిరికొండ, పెద్ద లింగాపూర్, ఒగులాపూర్ తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఇక గంగాధర మండలంలోని నారాయణపూర్, మిడ్‌మానేరు పరిధిలోని తోటపల్లి రిజర్వాయర్ల ఆయకట్టు మండలాలు గన్నేరువరం, చిగురుమామిడి, సైదాపూర్, తిమ్మాపూర్‌లో మరికొన్ని రోజుల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు పర్యవేక్షించి కాలువల ద్వారా సరిపడా నీళ్లు ఇవ్వాలని, చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

చామన్‌పల్లిలో ఎండిన మక్కచేనులో రైతు బోగొండ లక్ష్మి

సీఎం సారూ.. మా స్కూటీలు ఏమయ్యాయి?

'సీఎం సారూ.. మా స్కూటీలు ఏమయ్యాయి?' అంటూ ఖమ్మంలోని డిగ్రీ కళాశాలల విద్యార్థినులు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయినా స్కూటీల హామీని అమలుచేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం పోస్టుకార్డు ఉద్యమం ద్వారా నిరసన తెలిపారు.
- ఖమ్మం/ ఖమ్మం అర్బన్

ఈ అన్నం మేము తినలేం..

ఈ అన్నం మేము తినలేకపోతున్నాం అంటూ హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ బీసీ హాస్టల్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. అన్నం గిన్నెతో రోడ్డుపైకి వచ్చి అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చైతన్యపురి వివేకానందనగర్‌లోని బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు జిగురులాంటి అన్నం తినలేక అవస్థలు పడుతున్నారు. 10 రోజులుగా చెప్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. 124 మంది విద్యార్థులున్న ఈ హాస్టల్‌లో సరిపోను నీరు, బాత్రూమ్‌లు లేవని తెలిపారు. -ఎల్బీనగర్, ఫిబ్రవరి 13

రేవంత్ పాలనలో ఇసుక అక్రమ దందా

- 'ఉచితం' పేరిట అక్రమ రవాణా
- కొండల్‌రెడ్డికి ఈ ఆదాయం
- రేవంత్ దందాపై త్వరలో మరిన్ని ప్రూఫ్స్ బయటపెడ్తా
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత క్రిశాంక్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నదని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లకు, ఇతర పథకాలకు ఉచిత ఇసుక పేరుతో టన్నుల కొద్ది ఇసుకను అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఫలితంగా రాష్ట్రానికి ఇసుకపై రావాల్సిన ఆదాయం సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి జేబులోకి వెళ్తున్నదని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీతోపాటు ఇతర కొన్ని ప్రాజెక్టుల వద్ద నీటిని ఖాళీ చేసి మరీ ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. మూడు షిఫ్టుల్లో ఇసుక మైనింగ్ చేయాలని తాజాగా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ ఉత్తర్వులు కేంద్ర ప్రభుత్వ పర్యావరణ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఏడాదిలో ఐదుగురు ఎండీలను ఎందుకు మార్చారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన ఇసుక అమ్మకాలన్నీ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఈ అంశాన్ని బీఆర్ఎస్ లేవనెత్తుతుందని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డి ఇసుక దందాపై మరిన్ని వివరాలను త్వరలో బయటపెడతామని మన్నె క్రిశాంక్ తెలిపారు.

కేసీఆర్ హయాంలో భారీ ఆదాయం

ఉమ్మడి రాష్ట్రంలో ఇసుక ఆదాయం ఏటా రూ.19 కోట్లు దాటలేదని, కేసీఆర్ హయాంలో తెచ్చిన కొత్త ఇసుక పాలసీతో ఏటా రూ.800 కోట్లకు పైగా ఆదాయం సమకూరిందని మన్నె క్రిశాంక్ చెప్పారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి ఇసుక ద్వారా ఆదాయం భారీగా తగ్గిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో పదేండ్లలో రూ.5,900 కోట్ల ఆదాయం సమకూరిందని స్పష్టంచేశారు. గతంలో పంజాబ్ కాంగ్రెస్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ మంత్రి హోదాలో రాష్ట్రానికి వచ్చి కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీని ప్రశంసించారని, తమ రాష్ట్రంలో కూడా ఇలాంటి పాలసీని ప్రవేశపెడతామని చెప్పారని గుర్తుచేశారు.

దారితప్పిన ఇసుక రాబడి!

- సగానికి పడిపోయిన ఆదాయం
- అక్రమ దందాతో రాబడి పక్కదారి
- తోడైన రియల్ ఎస్టేట్ పతనం

హైదరాబాద్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇసుక ఆదాయం సగానికి పడిపోయింది. రియల్ ఎస్టేట్ పతనానికి ఇసుక మాఫియా తోడవడంతో ప్రభుత్వ రాబడికి భారీగా గండి పడింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత 2018-19లో అత్యధికంగా రూ.886.43 కోట్ల ఆదాయం రాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి వరకు రూ.376 కోట్లు మాత్రమే ఆదాయం రావడం పరిస్థితికి అద్దం పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా నెలన్నర మాత్రమే ఉంది. దీంతో మరో రూ.50-60 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

అధికార పార్టీ నేతల ఇష్టారాజ్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం నేలచూపులు చూస్తున్న విషయ విదితమే. దీనికితోడు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుక తోడేస్తుండటం, అధికారులు, కాంట్రాక్టర్లు వారితో మిలాఖతై ఇసుక దోపిడీకి తెరలేపడం ఆదాయంపై తీవ్రంగా ప్రభావం చూపిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా టీజీఎండీసీ ఆదాయం గణనీయంగా పడిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే మళ్లీ పునరావృతమయ్యే అవకాశముంది. 2014-15లో రూ. 19.12 కోట్ల ఆదాయమే వచ్చింది. దీంతో బీఆర్ఎస్ సర్కారు నూతన ఇసుక పాలసీ తీసుకొచ్చి పారదర్శకత పెంచడంతో ఆదాయం గణనీయంగా పెరిగింది.

832 కోట్ల టార్గెట్

ఈ నేపథ్యంలో ఇసుక ఆదాయాన్ని రూ.832 కోట్లకు పెంచాలని టీజీఎండీసీ లక్ష్యంగా పెట్టుకున్నది. ఇసుక రీచ్‌ల వద్ద మూడు షిఫ్టుల్లో పనిచేసే విధంగా ప్రణాళికలు రూపొందించింది. అయితే, కంచె చేను మేసిన చందంగా మైనింగ్, రవాణా, విజిలెన్స్ విభాగం అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ లక్ష్యాన్ని అందుకుంటుందో, లేదో చూడాలి.

ఇసుక ఆదాయం ఇలా...

సంవత్సరం	విక్రయం (లక్షల క్యూబిక్ మీటర్లు)	ఆదాయం (రూ. కోట్లలో)
2014-15	1.83	19.12
2015-16	65.94	374.99
2016-17	75.55	456.46
2017-18	112.54	678.33
2018-19	138.92	886.43
2019-20	124.33	792.80
2020-21	121.63	783.75
2021-22	120.00	750.32
2022-23	132.34	845.02
2023-24	110.45	670.53
2024.25	66.93	376.20 (జనవరి వరకు)

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆందోళనకు దిగిన గిరిజన నాయకులు

గురుకులంలో విద్యార్థి మృతి

- పడుకున్నచోటే ప్రాణాలొదిలిన పదో తరగతి విద్యార్థి దేవేందర్
- అనుమానాస్పద మృతిగా కేసు
- కులకచర్ల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఘటన

కులకచర్ల, ఫిబ్రవరి 13: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన టేకుల బీడ్ తండాకు చెందిన చందర్, సోనిబాయ్ దంపతుల రెండో కుమారుడు నేనావత్ దేవేందర్ (16) కులకచర్లలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఉంటూ కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి అందరితోపాటు భోజనం చేసి వసతి గృహంలో నిద్రించాడు. ఉదయం తోటి స్నేహితులు లేచి తమ పనులు పూర్తిచేసుకొన్నా.. దేవేందర్ నిద్రలేవలేదు. అతడిని లేపడానికి ప్రయత్నించగా అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి కేర్ టేకర్ రాజేందర్‌కు సమాచారమిచ్చారు. ఆయన వెంటనే 108 వాహనంలో పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి విద్యార్థి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. అతడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పదంగా మృతి చెందినట్టు కేసునమోదు చేశామని ఎస్సై అన్వేశ్‌రెడ్డి తెలిపారు. కాగా పరిగి ప్రభుత్వ దవాఖాన ముందు దేవేందర్ కుటుంబ సభ్యులు, గిరిజన సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను వేర్వేరుగా కలిసి పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థి మృతి కేసును విచారణ జరిపి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీ విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- బయటకు చెప్పొద్దని హెచ్చరించిన అధికారులు
- చండ్రుగొండ కేజీబీవీలో ఆలస్యంగా వెలుగులోకి

చండ్రుగొండ, ఫిబ్రవరి 13 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ కేజీబీవీలో ఇద్దరు విద్యార్థినులకు ఎలుకలు కరువగా.. ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దని అధికారులు హెచ్చరించిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేజీబీవీ హాస్టల్‌లో ఈ నెల 11న రాత్రి విద్యార్థినులు నిద్రిస్తున్న సమయంలో పదోతరగతి విద్యార్థినులు కాకటి స్వశ్రిత, కాకటి గోపిక కాళ్లను ఎలుకలు కరిచాయి. ఈ విషయాన్ని బుధవారం కేజీబీవీ స్పెషలాఫీసర్ కవిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారికి ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించారు. ఈ విషయాన్ని బయట చెప్పొద్దని హాస్టల్ అధికారులు హెచ్చరించారు. ఈ విషయం తల్లిదండ్రుల ద్వారా ఎంఈవో సత్యనారాయణకు గురువారం తెలిసింది. దీంతో ఆయన హాస్టల్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్‌కార్డుకు అడ్డుపడుతున్నారని..

ఆత్మహత్యాయత్నం

నిజాంసాగర్, ఫిబ్రవరి 13: తనకు రేషన్‌కార్డు రాకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ తహసీల్ కార్యాలయం ఎదుట ఓ యువకుడు గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మల్లూర్‌కు చెందిన గడ్డమీది సందీప్‌గౌడ్ (29) ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆరేండ్ల క్రితం వివాహం చేసుకున్న అతడు.. వేరు కాపురం పెట్టాడు. రేషన్‌కార్డు రాకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని ఆవేదనకు గురైన అతడు.. గురువారం నిజాంసాగర్ తహసీల్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు వచ్చి సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ భిక్షపతి.. బాధితుడితో మాట్లాడి రేషన్ కార్డు వచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

భరోసా భారంగా..మద్యం వసూళ్లు వేగంగా!

- 50 వేల కోట్ల మద్యం తాగించాలి
- ఎక్సైజ్ శాఖకు లక్ష్యం నిర్దేశం
- బీర్ల ధరల పెంపుతో 3 రోజుల్లో 330 కోట్ల ఆదాయం
- టకీటకీమంటూ రైతు భరోసా.. సీఎం హామీ ఇచ్చి 18 రోజులు
- ఇప్పటికీ భరోసా నిధులు రాలేదంటున్న రైతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వానికి బ్యాంకుల నుంచి అప్పులు పుట్టే పరిస్థితి లేకపోవటం తో ఇకపై మద్యం వ్యాపారం మీదనే సంక్షేమ పథకాలను నెట్టుకురావాలని నిర్ణయించుకున్నట్టు ఎక్సైజ్ వర్గాలు చర్చించుకుంటున్నా యి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ కు ప్రభుత్వం రూ.50 వేల కోట్ల రాబడి ల క్ష్యాన్ని నిర్దేశించినట్టు తెలిసింది. మద్యం ధరలు పెంచటం, సాధారణ విక్రయాలను రెండింతలు చేయటం ద్వారా లక్ష్యాన్ని సాధించాలని ఆ శాఖకు చెందిన అత్యున్నతస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. రైతు భరోసా, రు ణమాఫీ, భవిష్యత్తులో అమలు చేయబోయే ఇందిరమ్మ అభయహస్తం తదితర పథకాలన్నీ మద్యం డబ్బు ద్వారానే నడపాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే బీర్ల ధరలు 15 శాతం పెంచిన ప్రభు త్వం వచ్చే వారం పది రోజుల్లో విస్కీ, రమ్, విదేశీ మద్యం ధరలు కూడా 25 శాతం మే రకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఎడమ చేతితో కొడ్తే గొప్పో రైతు భ రోసా విధిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మూ డు రోజుల్లో కుడి చేతితో మద్యం పోసి రైతు లు, రైతు కూలీల ముక్కు పిండి రూ.330 కోట్లు వసూలు చేసినట్టు వ్యవసాయ, ఎక్సైజ్ శాఖలు లెక్కలు కడుతున్నాయి.

పడని భరోసా సొమ్ము..

'ఇవాళ అర్ధరాత్రి దాటంగనే భరోసా పైసలు టకీటకీమని రైతుల ఖాతాల్లో పడతాయి' అని గత నెల జనవరి 26న నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో జెండా పండగ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 18 రోజులు గడిచినా వాయిదాల మీద వాయిదాలు పెడుతున్నారు ఇదే ముఖ్యమంత్రి బీర్ల బేసిక్ ధర మీద 15 శాతం అదనపు ధరలు పెంచుతూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేస్తే.. తెల్లారేసరికల్లా పెంచిన ధరలు అమల్లోకి వచ్చాయి. సాధారాణ, మధ్య తరగతి మందుబాబులు ఎక్కువగా తాగే బీరు సీసా బ్రాండ్ల మీద ఎకాఎకిన రూ.40 వరకు పెరిగింది. రాత్రికి రాత్రే పాత బీర్ల మీది ఎమ్మార్పీ తొలగించి, కొత్త ఎమ్మార్పీ ప్రైస్ లేబుళ్లతో మార్కెట్‌లోకి విడుదల చేశారు. కానీ ఇదే స్పీడు రైతు భరోసా మీద లేదని రైతులు వాపోతున్నారు. రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన రోజు నుంచి ఇప్పటివరకు రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లకు మించి రైతుల ఖాతాల్లో జమ కావాలి. కానీ పెంచిన బీర్ల ధరలు అమల్లోకి వచ్చిన మంగళవారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం వరకు రూ.330 కోట్లు మద్యం వ్యాపారం ద్వారా సమకూరినట్టు ఎక్సైజ్ నివేదికలు చెప్తున్నాయి. ప్రత్యేకించి పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన 577 గ్రామాల్లోని బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయాల మీద ఎక్సైజ్ శాఖ ఆసక్తి కనబరిచినట్టు తెలిసింది. రేట్లు పెరిగిన తరువాత ఆయా గ్రామాల్లో బీర్ల విక్రయాలు ఎలా ఉన్నాయో అని ఆరా తీసినట్టు సమాచారం.

ఎక్సైజ్ కమిషనర్‌కే ఎసరు..

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్‌శాఖకు రూ.40 వేల కోట్ల రాబడిని లక్ష్యంగా నిర్దేశించగా.. మొదటి రెండు క్వార్టర్ల కాలంలో (6 నెలలు) అంచనాలు తప్పినట్టు నివేదికలు చెప్తున్నాయి. దీంతో మద్యం విక్రయాలు పెంచాలని ఎక్సైజ్ సిబ్బంది మీద ఒత్తిడి చేయటంతో వారు గ్రామాల్లో బెల్టు దుకాణాలను ప్రోత్సహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు మధ్యవర్తిత్వం చేసి లైసెన్స్‌డ్ దుకాణదారులతో మాట్లాడి బెల్టు దుకాణాల వారికి అరువుకు సరుకు ఇప్పించినట్టు ఎక్సైజ్ వర్గాల్లో ప్రచారం జరిగింది. విక్రయాలలో వెనుకబడిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు ఇవ్వటం చేశారు. దీంతో కొంతమేర ఆదాయం పెరిగినట్టు తెలిసింది. అంచనా వేసినంత రాబడి లేకపోవటంతో ఏకంగా ఎక్సైజ్ కమిషనర్‌కే ఎసరు పెట్టి ఆయన్ను బదిలీపై మరో శాఖకు పంపినట్టు అప్పట్లో కలకలం రేగింది. గత అనుభవాలరీత్యా ఈసారి జాగ్రత్తలు తీసుకొని లక్ష్యాన్ని నిర్దేశించినట్టు తెలిసింది.

గురుకులంలో ఇద్దరికి అస్వస్థత

- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 13: నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న తాడూరు మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం సాయంత్రం గురుకులంలోని విద్యార్థినులకు స్నాక్స్ అందించారు. తర్వాత ఏడో తరగతికి చెందిన ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పితో బాధపడుతుండగా సిబ్బంది వెంటనే స్థానిక ప్రైవేటు దవాఖాన తరలించగా.. పరీక్షించిన డాక్టర్లు చందన పరిస్థితి విషమంగా ఉందని, మరో విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. ప్రిన్సిపాల్ రష్మిని వివరణ కోరగా.. విద్యార్థినులకు పుడ్ పాయిజన్ కాలేదని, కడుపునొప్పి రావడంతో దవాఖానకు తరలించినట్టు తెలిపారు.